సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



యోగా తరగతులపై ప్రత్యేక శ్రద్ధ

యోగా తరగతులపై వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. 10లో



రోడ్లు నిర్మించాలని వినతి

తమ గ్రామాలకు రోడ్లు నిర్మించాలని రంపచోడవరం డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల గిరిజనులు వినతిపత్రాలు అందజేశారు. 10లో



ప్రకృతి అందాలు కనువిందు

జి.మాడుగుల: చింతపల్లి రోడ్డు మార్గంలో కొత్తపల్లి జలపాతం వద్ద సోమవారం పొగ మంచు అందాలు కనువిందు చేశాయి.

న్యూస్‌రీల్

వరద నష్ట పరిహారం మంజూరు

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: గత సెప్టెంబర్ నెలలో సంభవించిన వరదలు,భారీ వర్షాలకు నష్టపోయిన జిల్లాలోని 20,226 బాధిత కుటుంబాలకు రూ.10కోట్ల 84లక్షల 41వేల 600 నష్టపరిహారం ప్రభుత్వం మంజూరు చేసినట్టు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా 19,892మంది బాధితులను గుర్తించామని, గ్రామ సచివాలయాల్లో ఆయా జాబితాలను ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించామన్నారు. వాటిని విచారించిన తరువాత 20,226 బాధిత కుటుంబాలను ఖరారు చేసినట్టు తెలిపారు. బాధితులు 15,642 మందికి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేశామని తెలిపారు. మిగతా 4,584మంది బాధితులకు సంబంధించి సాంకేతిక సమస్యలు పరిష్కరించి వారి ఖాతాల్లోను జమచేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

జెడ్పీ సీఈవోగా నారాయణ మూర్తి బాధ్యతల స్వీకరణ



మహారాణిపేట (విశాఖ): జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో)గా పి.నారాయణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు డీఎల్డీవోగా ఉన్న ఈయన కాకినాడ జెడ్పీ సీఈవో(ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పదోన్నతిపై విశాఖ జిల్లా జెడ్పీ సీఈవోగా విచ్చేశారు. జెడ్పీ అధికారులు, సిబ్బంది సీఈవో నారాయణమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సీలేరు: జలవిద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ జెన్‌కో ఎస్ఈకి తెలుగునాడు విద్యుత్ కార్మికసంఘం ప్రతినిధి భాస్కర్‌రావు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జలవిద్యుత్ కేంద్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు స్థానిక జెన్‌కో ఆస్పత్రిలో వైద్య సదుపాయం కల్పించాలని, పారిశుధ్య కార్మికులకు పనిదినాలు పెంచాలని కోరినట్టు ఆయన తెలిపారు. అంతేకాకుండా ఖాళీ అయిన కాంట్రాక్ట్ కార్మికుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ సెక్రటరీ భాస్కర్‌రావు,బ్రాంచ్ సెక్రటరీ వెలుగూరి కృష్ణ, నడిగొట్ల వరప్రసాద్, కాంట్రాక్ట్ కార్మికులు పి.వరహాలు పాల్గొన్నారు.



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు లోత సూరిరెడ్డి (33). వై.రామవరం మండలం దేవరమడుగులు గ్రామం. రోజూ మాదిరిగానే గత సెప్టెంబర్ 5వ తేదీన తెల్లవారుజామున అటవీ ప్రాంతంలోని కొండపోడుకు బయలుదేరాడు. అదేమార్గంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఇది గమనించిన వేటగాళ్లు మృతదేహాన్ని అక్కడి నుంచి అటవీప్రాంతంలోకి తరలించి పూడ్చేశారు. కొద్దిరోజుల తరువాత దుర్వాసన రావడంతో ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లింది. మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు సూరిరెడ్డిగా గుర్తించి దర్యాప్తు మొదలు పెట్టారు. ముగ్గురు వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చుకు బలైనట్టుగా గుర్తించారు.



వై.రామవరం మండలం దేవరమడుగుల అటవీ ప్రాంతంలో వేటగాళ్లు పూడ్చేసిన సూరిరెడ్డి మృతదేహం (ఫైల్)

ఉసురు తీస్తున్న ఉచ్చు

విద్యుత్ వైర్లతో యథేచ్ఛగా వన్యప్రాణుల వేట

- చిక్కుకుని గాలిలో కలిసిపోతున్న జంతువులు, మనుషుల ప్రాణాలు
- వై.రామవరం, చింతూరు, గంగవరం మండలాల్లో ఘటనలు

వన్యప్రాణుల కోసం వేటగాళ్లు ఏర్పాటుచేసిన విద్యుత్ ఉచ్చులు మనుషుల ప్రాణాలను హరిస్తున్నాయి. తాజాగా వారి ఉచ్చుకు సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ బలయ్యారు. వన్యప్రాణుల కోసం అటవీ ప్రాంతంలో అమర్చిన విద్యుత్ ఉచ్చు తగిలి ప్రాణాలు కోల్పోయారు. తరచూ ఇలా ఎవరో ఒకరు బలవుతూనే ఉన్నా వేటగాళ్లపై కఠినంగా వ్యవహరించడం లేదు. కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం వల్లే వారి ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



యార్లగడ్డలో వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని మృతి చెందిన గేదెలు (ఫైల్)

వై.రామవరం/గంగవరం/చింతూరు: జిల్లాలో వై.రామవరం, గంగవరం, చింతూరు మండలాల్లో వన్యప్రాణాల వేట యథేచ్ఛగా జరుగుతోంది. అధిక శాతం వేటగాళ్లు విద్యుత్ ఉచ్చును వినియోగిస్తున్నారు. దీనివల్ల వై.రామవరం మండలంలో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి.

- మోతుగూడెం పోలీసుస్టేషన్ పరిధిలో ఇంతులూరు వాగు, ఒడియా క్యాంపు, సుకుమామిడి, మంగంపాడు, ఎంసీడీ క్యాంప్ విద్యుత్ ఉచ్చులతో అడవి జంతువులను వేటాడుతున్నారు. డొంకరాయి– మోతుగూడెం గిరిజన గ్రామాల మీదుగా 11కేవీ లైన్ విద్యుత్‌ను వినియోగిస్తున్నట్టు తెలిసింది. దాదాపు చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. దీనివల్ల రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతున్న సందర్భాలు ఉన్నాయి. అడవిపందులు, అడవి గేదెలు, దుప్పులు, జింకలను వేటాడుతున్నట్టు సమాచారం. రాత్రి నుంచి తెల్లవారు వరకు విద్యుత్ కంచెకు సరఫరా ఉంచి తరువాత తొలగిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదు.
- గంగవరం మండలంలో మొల్లేరు, లొక్కొండ, పిడతమామిడి, గొరగొమ్మి, మోహనాపురం అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల వేట విచ్చలవిడిగా జరుగుతోంది. ఎక్కువగా విద్యుత్ ఉచ్చు ఏర్పాటుచేసి వేటాడుతున్నారు. మొల్లేరు ప్రాంతానికి చెందిన పెనుమత్స ధనరాజ్ అదే ప్రాంతంలోని శివారులో మామిడితోటలో మకాం ఉండేవారు. గత మే 27న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగిరాలేదు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక్కడికి సమీపంలోని అటవీ ప్రాంతంలో పూర్తిగా పాడైన అతని మృతదేహం కనిపించింది. దీనిపై పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. వన్యప్రాణులకోసం ఏర్పాటుచేసిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని మృతి చెందినట్టుగా వారు గుర్తించారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు.

అడవి జంతువుల వేటకు అడ్డా..

విద్యుత్ ఉచ్చులతో అడవి జంతువుల వేటకు వై.రామవరం మండలం అడ్డాగా మారింది. వేటగాళ్ల ఆగడాలకు వన్యప్రాణులతో పాటు అమాయకులు బలైన సంఘటనలు ఉన్నాయి. పోలీసుల దృష్టికి వచ్చినవి మాత్రమే బయటకు వస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

కొండపోడుకు వెళ్తూ..

చవిటిదిబ్బలు గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని అదే గ్రామానికి చెందిన గిరిజన రైతు కుర్రే వెంకటేశ్వర్లు (40) ప్రాణాలు కోల్పోయాడు. అడవి మార్గంలో కొండ పోడుకు వెళ్తుండగా విద్యుత్ వైరు కాలుకు తగలడంతో షాక్ గురై చనిపోయాడు. ఈ ఘటన మే 5, 2007లో చోటుచేసుకుంది. ఈ ఘటనలో విద్యుత్ తీగలు అమర్చిన ఐదుగురిని అరెస్టు చేశారు.

తాను అమర్చిన ఉచ్చులో తానే చిక్కుకుని..

యార్లగడ్డ గ్రామానికి చెందిన జంప రాజబాబు (28) విద్యుత్ ఉచ్చులతో వన్యప్రాణాలను వేటాడేవాడు. దీనిలో భాగంగా అమర్చిన ఉచ్చుకు అడవి జంతువు చిక్కింది. దాని తీసేందుకు వెళ్లిన అతని కాలుకు విద్యుత్ ఉచ్చు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఫిబ్రవరి 15, 2017లో చోటుచేసుకుంది.

ఉచ్చు వైరు తగిలి..

చవిటి దిబ్బలు గ్రామానికి చెందిన గిరిజన రైతు పూజారి భూపాలరావు (55) విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడు. కొండపోడుకు వెళ్తుండగా వైరు తగలడంతో చిక్కుకుని మృతి చెందాడు. ఈ ఘటన అక్టోబర్ 30, 2017లో జరిగింది. ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేశారు.

పొలానికి వెళ్తూ చిక్కుకుని..

రాచపాలెం గ్రామానికి చెందిన వలాల సూకరాజు (53) పొలానికి వెళ్తుండగా వన్యప్రాణులకోసం ఏర్పాటుచేసిన విద్యుత్ వైరుకు తగలడంతో మృతి చెందాడు. ఈ కేసులో వన్యప్రాణులను వేటాడుతున్న ఇద్దరిని అరెస్టు చేశారు.

- సింహాద్రిపాలెం గ్రామానికి సమీప అటవీప్రాంతంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ఉచ్చుకు అదే గ్రామానికి చెందిన వేట్ల శ్రీరాములరెడ్డి బలయ్యారు. పొలానికి వెళ్తుండగా ఉచ్చులో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన నవంబర్ 28, 2022లో జరగ్గా, ఇద్దరిని అరెస్టు చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



విద్యుత్ కంచెలు ఏర్పాటుచేసి వన్యప్రాణులు, మనుషుల ప్రాణాలకు హాని కలిగించే వారిపై చర్యలు తీసుకుంటాం. అటవీ, వ్యవసాయ భూముల్లో ఈ విధంగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. దీనిపై ఇప్పటికే దిగువస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చాం.

– పంకజ్‌కుమార్ మీనా, ఏఎస్పీ, చింతూరు

వేటగాళ్ల ఆగడాలకు ఏఎస్ఐ బలి



తిరువాణక్కు అరసు (ఫైల్)

వన్యప్రాణులను వేటాడేందుకు ఏర్పాటుచేసిన విద్యుత్ ఉచ్చు విధి నిర్వహణలో భాగంగా కూంబింగ్‌కు బయలుదేరిన సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ తిరువాణక్కు అరసు (54) ప్రాణాలను బలిగొంది. మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో డొంకరాయి స్టేషన్‌కు చెందిన పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు కూంబింగ్‌కు వెళ్లారు. దీనిలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి 1.20 సమయంలో మెట్టగూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వచ్చారు. రహదారి పక్కనే అడవి జంతువుల కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చు ఆయన కాళ్లకు తగలడంతో షాక్‌కు గురయ్యారు. అపస్మారకస్థితికి చేరిన ఆయనను వెంటనే డొంకరాయి జెన్‌కో ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు.

అటవీశాఖ అధికారులకు పట్టదా! 10లో

కాఫీ కార్మికుల సమ్మె సైరన్

- 15 లోగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- లేదంటే విధులకు రాబోమని హెచ్చరిక



చింతపల్లిలో సమావేశమైన కాఫీ కార్మిక సంఘాల నాయకులు

చింతపల్లి: ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. లేకుంటే ఈనెల 15 తరువాత సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. సోమవారం చింతపల్లిలో పాడేరు, చింతపల్లి, ఆర్‌వీ నగర్ డివిజన్‌ల పరిధిలో పనిచేస్తున్న కాఫీ కార్మికులంతా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సుమారు 20 ఏళ్లనుంచి కాఫీ తోటల్లో కార్మికులుగా పనిచేస్తున్నా వారి బాగోగులను సంస్థ కనీసం పట్టించుకోవడం లేదన్నారు. కూలి రేట్లను పెంచకపోగా కార్మికులకు మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఉద్యోగ భద్రతపై పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈసమస్యలన్నింటిపై ఈనెల 15న అన్ని డివిజన్ మేనేజర్లకు సమ్మె నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో తోటల్లో విధులను బహిష్కరించి సమ్మెకు దిగుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మికసంఘాల ప్రతినిధులు అమర్, సుందరరావు, బుజ్జిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల చిన్నారి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆందోళన



పూర్ణిమ మృతదేహం

సీలేరు: తమ కుమార్తె మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ కాలనీకి చెందిన తల్లిదండ్రులు తాంబేలు సొమర, పార్తిమ ఆరోపించారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రెండు నెలల పాప పూర్ణిమ ఆయాసం, దగ్గు, జ్వరంతో బాధపడుతుండటంతో ఆదివారం ఉదయం సీలేరు పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారులు లేకపోవడంతో అక్కడే ఉన్న స్టాఫ్ నర్సు దేవి వద్దకు తీసుకువెళ్లారు. ఓపీ నమోదు చేయకుండానే చిన్నపిల్లల డాక్టర్లు లేరని, పాపను చింతపల్లి లేదా చింతూరు ఆస్పత్రులకు తీసుకువెళ్లాలని ఆమె చెప్పిందన్నారు. ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకువెళ్లి వైద్యం చేయించి ఇంటికి వెళ్లిపోయామన్నారు. ఆదివారం రాత్రి పది గంటల సమయంలో పాప ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఆశా కార్యకర్త సహకారంతో సీలేరు జెన్‌కో ఆస్పత్రికి చెందిన సీఎస్సార్ అంబులెన్సులో మళ్లీ సీలేరు పీహెచ్‌సీకి తీసుకువచ్చామన్నారు.పాప ఆరోగ్యం విషమంగా ఉన్నప్పటికీ వైద్య సిబ్బంది ఎటువంటి పరీక్షలు చేయకుండానే చింతూరు ఆస్పత్రికి రిఫర్ చేశారన్నారు. దీంతో అదే అంబులెన్సులో బయలుదేరగా మంగంపాడు వద్దకు వెళ్లే సరికి పాప మృతి చెందినట్టు తెలిపారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కుమార్తె మృతి చెందిందని వారు ఆరోపించారు. ఆస్పత్రిలో ఇద్దరు వైద్యాధికారులను ప్రభుత్వం నియమించినప్పటికీ వీరిలో ఒక్కరు కూడా విధుల్లో లేరన్నారు. ఆదివారం ఉదయం సరియైన వైద్యం అందిఉంటే పాప ఆరోగ్య పరిస్థితి విషమించేది కాదని వాపోయారు.



నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబసభ్యులు

వైద్య సిబ్బందితో వాగ్వాదం

చిన్నారి తల్లిదండ్రులు సోమవారం గ్రామస్తులతో కలిసి స్థానిక పీహెచ్‌సీకి వచ్చారు. వైద్యాధికారి మస్తాన్‌వల్లీ,స్టాఫ్ నర్సు దేవితో వాగ్వాదానికి దిగారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఫంక్షన్‌కు వెళ్లినందున ఆస్పత్రికి రాలేదని ఇద్దరు వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మస్తాన్‌వల్లీ మాట్లాడుతూ పాపకు వైద్యం అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం లేదన్నారు. ఆదివారం తాము రాకపోయినప్పటికీ సిబ్బందికి ఫోన్‌లో తగు సూచనలు ఇచ్చామన్నారు. పాప ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చింతూరు ఆస్పత్రికి రిఫర్ చేశామని వివరణ ఇచ్చారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు







ప్రత్యేక అలంకరణలో అరకులో భ్రమరాంబదేవి, పాడేరులోని రాజరాజేశ్వరిదేవి, సంగోడిలో పార్వతీదేవి

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదవరోజు సోమవారం దేవతామూర్తులు మహా చండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అరకులోయలోని భ్రమరాంబదేవి, పాడేరులోని దుర్గమ్మ, రాజరాజేశ్వరి, సంగోడిలో పార్వతీదేవి మహా చండీదేవిగా అలకంరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారి దర్శనాలకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఇటు మంచు.. అటు ఎండ..వాన



పాడేరులో ఉదయం 8 వరకు దట్టంగా కురిసిన మంచు



పాడేరులో మధ్యాహ్నం నుంచి కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: మన్యంలో వాతావరణం చాలా వింతగా.. భిన్నంగా ఉంటుంది. గత వారం రోజులుగా అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. సోమవారం ఉదయం 8 గంటల వరకు మంచు భారీగా కురిసింది. ఆ తరువాత మంచుతెరలను చీల్చుకుని వచ్చిన ఉదయభానుడు కాసేపటికే మబ్బుల చాటుకు వెళ్లాడు. ఆ తరువాత నుంచి సాయంత్రం వరకు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన సీఈవో



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట(విశాఖ): జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో)గా బాధ్యతలు స్వీకరించిన పి.నారాయణమూర్తి సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.

బంగారు పతక విజేతకు అభినందన



బంగారుపతకం సాధించిన సింహాచలంను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో డిస్కస్ త్రో విభాగంలో బంగారుపతకం సాధించిన స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థి వంతాల సింహాచలంను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అభినందించారు. ఆయనను సోమవారం కలెక్టరేట్‌లో విద్యార్థి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కోచ్ మన్మథరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తేవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఇలావుండగా ఈనెల 17వతేదీ నుంచి గుంటూరు నాగార్జున విశ్వ విద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు సింహాచలం ఎంపియ్యాడు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు 15 వరకు గడువు

అనకాపల్లి: ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదీన నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు హాజరుకాగోరు విద్యార్థులు ఈనెల 15 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ రసీదును ఈనెల 17వ తేదీలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఎస్ఈ.ఏపి.ఐఎన్‌లో చూడాలని తెలిపారు.

విద్యార్థి భవితవ్యానికి 'అపార్'

- ఆధార్ తరహాలో 12 అంకెల కార్డు
- వన్ నేషన్ వన్ స్టూడెంట్ విధానంలో జారీకి అధికారుల కసరత్తు
- అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ

యలమంచిలి రూరల్: జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా ఆధార్ తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్‌ను కేటాయించనున్నారు. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేస్తారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు ఈ నంబర్ కేటాయించనున్నారు. జిల్లాలో మొదటగా ప్రైమరీ స్కూల్ నుంచి హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ నంబర్ కేటాయించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ప్రతి విద్యార్థికి పెన్(పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్) ఉంది.దీని ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంతో పాటు టీసీలు జారీ చేస్తున్నారు.ఇకపై అపార్ ఉంటే అనకాపల్లి విద్యార్థి బెంగుళూరులోనూ,కాశ్మీర్ విద్యార్థి విశాఖపట్నం లోనూ ఇలా దేశంలో ఎక్కడైనా వెళ్లి చదువుకునే వెసులుబాటు ఉంటుంది.

అపార్ కార్డు పొందే విధానం

అపార్ కార్డు పొందే విద్యార్థితో పాటు తల్లి లేదా తండ్రి కచ్చితంగా విద్యాసంస్థకు వెళ్లాలి.తొలుత యూడైస్ ప్లస్‌లో నమోదైన వివరాలను వారు సరిచూసుకోవాలి.అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దీనికి ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపాల్ ధ్రువీకరణ తప్పనిసరి.విద్యార్థి ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది.దానిని నమోదు చేసిన అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది.

ఆన్‌లైన్‌లో అపార్ కార్డు ఒకసారి వెలువడితే దాని సవరణకు అవకాశం ఉండదు.కాబట్టి అన్నీ ముందే సరిచూసుకోవాలి. జిల్లాలో ముందుగా 9, 10 తరగతుల విద్యార్థులకు అపార్ కార్డుల నమోదు చేపట్టారు.అన్ని రకాల యాజమాన్యాల విద్యార్థులకు ఇది అవసరం.



అపార్ కార్డు నమూనా



కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ రూపొందించిన అపార్ పోర్టల్



ప్రయోజనం ఇలా..

అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయి. పేరు, పుట్టిన తేదీ,జెండర్ క్యూఆర్ కోడ్,12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు అన్నీ కలిపి డిజిటల్ కార్డు రూపంలో భద్రపరుస్తారు.విద్యార్థి చదువుకు సంబంధించిన అకాడమీ సమాచారం అంటే ఎన్ని మార్కులు లేదా ఏ గ్రేడ్ వచ్చింది, ఉపకార వేతన వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలు, వ్యక్తిగత, విద్యా సంబంధిత వివరాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. విద్యార్థికి కేటాయించిన నంబరును ఇంటర్‌నెట్‌లో అన్వేషించడం లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి సమాచారం చిటికెలో వచ్చేస్తుంది. వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు,ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు,ధ్రువీకరణ సులువుగా పూర్తవుతుంది.ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ,ఇంటర్వ్యూ సమయంలో ఇది కీలకం కానుంది. అకాడమీ పరంగా విద్యార్థికి జీవితకాల గుర్తింపుగా పరిగణిస్తారు.విద్యార్థి వివరాలన్నీ డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉండడంతో ఆ వివరాలన్నింటినీ ఉద్యోగాల భర్తీ,ఇతర కీలక సమయాల్లో ప్రామాణికంగా తీసుకుంటారు.

విద్యాశాఖ కసరత్తు

జిల్లాలో 1 నుంచి 12వ తరగతి వరకు ఉన్న 2,54,911 మంది విద్యార్థులకు అపార్ ఐడీని రూపొందించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.దీనిలో భాగంగా తొలివిడతలో ట్రయల్ రన్‌గా 9,10 తరగతులకు అపార్ ఐడీని రూపొందించే పనిని ప్రారంభించామని జిల్లా సహాయ గణాంక అధికారి సత్యప్రసాద్ చెప్పారు.అపార్ ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉంది.యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో విద్యార్థికి పెన్(పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్) ఉండేలా చర్యలు తీసుకోవాలి, ఆధార్ చెల్లుబాటు(వ్యాలిడేట్) అయి ఉండేలా చూడాలి. అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది.ప్రాథమిక విద్య మొదలు ఇంటర్ వరకు అపార్ ఐడీ జారీ దిశగా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.ఈ నెల 14వ తేదీ లోగా ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకుల అనుమతి పత్రాలను తీసుకున్న అనంతరం ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ రూపొందించనున్నారు.

అపార్‌తో ఎన్నో ప్రయోజనాలు



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే దిశగా విద్యాసంస్థల నిర్వాహకులకు సూచిస్తున్నాం.అపార్ ఐడీ క్రియేట్ చేసేటప్పుడు పాఠశాలల్లో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే విద్యాశాఖ కార్యాలయంలో గణాంక అధికారిని సంప్రదించాలి.అపార్ కార్డు జారీ వల్ల విద్యార్థులకు ఎన్నో ఉపయోగాలుంటాయి. తల్లిదండ్రులు చొరవ చూపాలి.

– ఎం.వెంకటలక్ష్మమ్మ,జిల్లా విద్యాశాఖాధికారి

అటవీశాఖ అధికారులకు పట్టదా!

చింతూరు: వేటగాళ్ల ఉచ్చుకు అడవి పందులు, నెమళ్లు, జింకలు, మనుషుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వేటగాళ్ల అగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నా అటవీ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. మనుషుల ప్రాణాలు పోతున్నా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

కరెంటును వాడడం నేరమే!

అడవి జంతువులను చంపడానికి వేటగాళ్లు కరెంటును వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో వేటగాళ్లు వ్యవసాయ పొలాల్లో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్లను వేటకు వినియోగిస్తున్నారు. కరెంటు ఉచ్చుకు అడవి జంతువులు, మనుషులు చిక్కుకున్న వెంటనే సంబంధిత సబ్‌స్టేషన్‌లో ఆయా విద్యుత్ లైన్ ట్రిప్ అవుతుంది. అప్పుడు సబ్ స్టేషన్‌లో పనిచేసే డ్యూటీ ఆపరేటర్లు విద్యుత్ లైన్ ట్రిప్ అయిన సమయాన్ని రికార్డులో నమోదు చేస్తారు. వెంటనే తిరిగి లైన్ చార్జ్ చేస్తారు. విద్యుత్ లైన్లు అధిక వర్షానికి, విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు పడినప్పుడు మాత్రమే ట్రిప్ అవుతాయి. అలాకాకుండా వేటగాళ్ల స్వార్థానికి ట్రిప్ అవుతున్నా ట్రాన్స్‌కో అధికారులు కారణాలు తెలుసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు

తుమ్మపాల: పట్టణంలోని గవరపాలెం కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక గౌరీ సేవా సంఘం మల్ల జగన్నాథం కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు సోమవారంతో ముగిశాయి. జయ కళానికేతన్ విశాఖ వారి శ్రీకాంత్ కృష్ణమాచార్య నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో నాటక ఉత్సవాల విరాళ దాత కర్రి సన్యాసి నాయుడు, కనకదుర్గమ్మ ఆలయ వ్యవస్థాపకుడు పి.వి. రమణ, కనకదుర్గమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక ఐసీడీఎస్ చెంతకు

- చిన్నారిని అపహరించిన మనోహర్‌పై కేసు నమోదుకు పీవో ఆదేశాలు
- దొంతురాయి స్కూలు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు జారీ



తప్పిపోయిన చిన్నారిని ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : ఇటీవల రాజమండ్రి వంతెన వద్ద తప్పిపోయి పోలీసులకు చిక్కిన ఓ గిరిజన చిన్నారి వ్యవహారంలో బాధ్యుడైన శెట్టి మనోహర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని ఐటీడీఏ పీఓ అభిషేక్ పోలీసులను ఆదేశించారు. మైనర్ బాలికలను పనిలో చేర్చి వెట్టిచాకిరి చేయించే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుని బాలికలకు విముక్తి కల్పించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ సూర్య లక్ష్మి అందించిన వివరాలివి. హుకుంపేట మండలం దొంతురాయి గ్రామానికి చెందిన గిరిజన చిన్నారి కాకరి మోక్షితదేవి (9) అదే గ్రామంలో పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. రెండు నెలల క్రితం శెట్టి మనోహర్ అనే వ్యక్తి బాలికను తన వెంట రాజమండ్రి తీసుకొని వెళ్లి ఇంట్లో వెట్టి చాకిరి పనులు చేయించాడు. అతడి నుంచి తప్పించుకున్న బాలిక నాలుగు రోజుల క్రితం గోదావరి వంతెనపై నడిచి వెళ్లడం చూసిన ఓ వ్యక్తి ఆమెను రాజమండ్రిలో పోలీసులకు అప్పగించారు. రాజమండ్రి పోలీసులకు అందించిన సమాచారం మేరకు రంప చోడవరం, అడ్డతీగల ఐసీడీఎస్ సీడీపీఓలు సంధ్యారాణి, సుధలను రాజమండ్రి పంపించామన్నారు. సీడీపీఓలు ఆ బాలికను తీసుకువచ్చి ఈనెల 5న తనకు అప్పగించగా ఐటీడీఏ పీవో దగ్గరకు తీసుకువెళ్లామని చెప్పారు. పీవో అభిషేక్ బాలికకు కొత్త బట్టలు కొనిచ్చి బాలసదనంలో చేర్పించి విద్య అందించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. స్థానిక సీఐ దీనబంధుతో ఫోన్లో మాట్లాడారు. బాల కార్మిక చట్టం చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. దొంతురాయి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఈఓ బ్రహ్మాజీరావును ఆదేశించారు. రెండు రోజులు విద్యార్థులు పాఠశాలకు రాకపోతే వెంటనే ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని, ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులకు సర్క్యులర్ జారీ చేయాలని డీఈవోను ఆదేశించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ రజనీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఊర్మిళ పాల్గొన్నారు.

వారోత్సవాల ప్రభావం.. రవాణాకు ఆటంకం

- నైట్ సర్వీసులు రద్దు
- బస్సుల రూట్‌ల్లో మార్పులు
- గ్రామస్తులకు తప్పని అవస్థలు
- పోలీసుల ముమ్మర గస్తీ



కూనవరం జంక్షన్ వద్ద రాత్రిపూట వాహనాలను దారి మళ్లిస్తున్న పోలీసులు



చింతూరు మండలం చట్టిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతూరు: మావోయిస్టుల వారోత్సవాల ప్రభావంతో చింతూరు డివిజన్‌లో రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. గత నెల 22 నుంచి ఈనెల 23వ తేదీ వరకు మావోయిస్టులు దండకారణ్యంలో వారోత్సవాలకు పిలుపునిచ్చారు. వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు ఏమైనా ఘటనలకు పాల్పడవచ్చనే అనుమానంతో పోలీసులు కూంబింగ్‌తో పాటు సోదాలు ముమ్మరం చేశారు. మరోవైపు వారోత్సవాల నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి చింతూరు మీదుగా వెళ్లే అన్ని నైట్ బస్సు సర్వీసులను ఆయా డిపోలు రద్దు చేశాయి. ఇందులో భాగంగా ఆంధ్రాలోని కాకినాడ, విశాఖపట్నం, గన్నవరం, విజయవాడతో పాటు తెలంగాణలోని హైదరాబాద్, కరీంనగర్, తాండూరు డిపోలకు చెందిన నైట్ సర్వీసులు రద్దయ్యాయి. దీంతో ఆయా సర్వీసులపై ఆధారపడి ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూటు డైవర్షన్

మరోవైపు చింతూరు మండలం కొత్తూరు, ఏడుగురాళ్లపల్లి నడుమనున్న జాతీయ రహదారిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావముంటుంది. గతంలో ఈ ప్రాంతంలోనే వారు అనేక వాహనాలను దహనం చేసిన ఘటనలున్నాయి. దీంతో రాత్రిపూట వాహనాలు అటువైపుగా వెళ్లకుండా చింతూరు మండలం కూనవరం జంక్షన్ నుంచి భీమవరం జంక్షన్ మీదుగా భద్రాచలం వెళ్లేలా పోలీసులు వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ఆంధ్రాతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశాల నుంచి సాయంత్రం ఆరు గంటల అనంతరం వచ్చే వాహనాలను ఈ రూట్‌లో పంపిస్తున్నారు. ఇదే క్రమంలో తెలంగాణ నుంచి చింతూరు, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు వెళ్లే వాహనాలను ఎటపాక మండలం నెల్లిపాక జంక్షన్ నుంచి కూనవరం మండలం భీమవరం జంక్షన్ మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం ఆరు గంటల అనంతరం తిరిగి ఏడుగురాళ్లపల్లి మీదుగా యథావిధిగా వాహనాలు వెళ్లేందుకు పోలీసులు అనుమతిస్తున్నారు. సాయంత్రం ఆరు గంటల అనంతరం వాహనాలు నిలిపివేస్తుండడంతో రాత్రి ఏడు, ఎనిమిది గంటలకు వెళ్లాల్సిన పలు బస్సులు ఆరు గంటల కంటే ముందే వెళ్లిపోతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణానికి ఆటంకం కలుగుతున్న నేపథ్యంలో చాలా మంది రాత్రిపూట ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. అత్యవసరంగా ప్రయాణించాల్సి వస్తే డైవర్షన్ రూట్‌లో తమ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.

భద్రతా చర్యల్లో భాగంగానే

భద్రతా చర్యల్లో భాగంగానే రాత్రిపూట వాహనాలను దారి మళ్లిస్తున్నామని చింతూరు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఏడుగురాళ్లపల్లి రహదారిలో రాత్రిపూట వాహనాలు ప్రయాణిస్తే మావోయిస్టులు ఏమైనా ఘటనలకు పాల్పడే అవకాశమున్నందున చట్టి గ్రామం దాటిన అనంతరం కూనవరం జంక్షన్ నుంచి భీమవరం జంక్షన్ మీదుగా వాహనాలు పంపుతున్నట్టు ఆయన తెలిపారు.

యోగా తరగతులపై ప్రత్యేక శ్రద్ధ

సాక్షి,పాడేరు: యోగా తరగతులపై వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమశాఖ అధికారులు, యోగా మాస్టర్ ట్రైనీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనలో గిరిజన విద్యార్థులను అగ్రస్థానంలో నిలపాలన్నారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న శక్తిని బయటకు తీయాలని సూచించారు. విద్యార్థుల్లో ఆసక్తికి అనుగుణంగా శిక్షణ ఇవ్వడం ద్వారా క్రమశిక్షణతో కూడిన మంచి పౌరులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. యోగా సాధనకు పైలట్ ప్రాజెక్ట్‌గా పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల్లోని అన్ని పాఠశాలల్లో అమలుజేయాలన్నారు. యోగా సాధనతో పాటు సూర్య నమస్కారాలు నేర్పించాలని, తద్వారా విద్యార్థులు మానసికంగా, శారీరకంగా బలోపేతం అవ్వడంతో పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకుంటారన్నారు. యోగాలో భాగంగా వారికి స్ఫూర్తిదాయక కథనాలను అందించాలన్నారు. యోగా సాధనలో 40 రోజుల్లో విద్యార్థుల్లో మార్పు కనిపిస్తే జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో యోగా అమలుజేస్తామన్నారు. మాస్టర్ ట్రైనీలంతా లక్ష్యసాధనకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజని, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఏడుగురి అరెస్టు

- 40 కేజీల గంజాయి, కారు, బైక్ స్వాధీనం



పోలీసుల అదుపులో గంజాయి నిందితులు



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎస్ఐ మల్లేశ్వరరావు, సిబ్బంది

నర్సీపట్నం: గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేశామని రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఎస్సై రాజారావు తన సిబ్బందితో కలిసి చింతపల్లి రోడ్డు సాధుపాకల జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సమీప పొలం గట్లు మీదుగా నిందితులు మూట తీసుకెళ్తుండగా గమనించి, వెంబడించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 22 కిలోల గంజాయితోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒడిశాకి చెందిన రశ్మిరంజన్ సాహు, జి.మాడుగుల మండలం బురిడి గురుమూర్తి, తమిళనాడుకు చెందిన అరుముగం సురేష్ కుమార్, బాల సుబ్రహ్మణ్యన్ ముత్తుకుమార్ ఉన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఒడిశా బోర్డర్‌లో కొనుగోలు చేసిన గంజాయిని తమిళనాడుకు తరలిస్తున్నట్టు విచారణ వెల్లడైందని సీఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

దేవరాపల్లి: ఏజెన్సీ నుంచి కారులో గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను దేవరాపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ టి. మల్లేశ్వరరావు తన సిబ్బందితో కలిసి సోమవారం రైవాడ పంచాయతీ శివారు శ్రీరాంపురం వై. జంక్షన్ వద్ద మాటు వేశారు. ఈ క్రమంలో ఏజెన్సీ నుంచి వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా 40 కేజీల గంజాయి పట్టుబడింది. గంజాయిని సీజ్ చేసి, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నందపూర్ మండలం, హికుంపుట్ పంచాయతీ నీలాదోరపుట్ గ్రామానికి చెందిన మోహన్ బైరాగి, పద్మన్ కెముండీ, మధ్యప్రదేశ్‌లోని అనుక్‌పూర్ జిల్లా కోట్మా గ్రామానికి చెందిన అతుల్ సోని ఉన్నారు. ఆంధ్రా ఒడిశా బోర్డర్(ఏవోబీ)లో కొనుగోలు చేసిన గంజాయిని దేవరాపల్లి మీదుగా ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు తరలించేందుకు ప్లాన్ చేసుకున్నారు. దీనిలో భాగంగా వీరిలో ఒకరు బైక్‌పై ముందుగా ప్రయాణించి రూట్ క్లియరెన్స్ ఇచ్చి కారులో తరలిస్తుండగా పట్టుకున్నారు. కారు, బైక్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్లు నిర్మించాలని వినతి


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గిరిజనుల అర్జీలు

రంపచోడవరం: తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని దేవీపట్నం మండలం ఎర్రమెట్ల గిరిజనులు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంను కోరారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీ అందజేశారు. ఎర్రమెట్ల నుంచి పెద్దనూతులు వరకు 39 కిలోమీటర్లు, మద్దిరాతి గూడెం నుంచి ఏడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాలని సర్పంచ్ చిన్నబ్బులురెడ్డి, పండురెడ్డి, రామిరెడ్డి, అబ్బాయిరెడ్డి కోరారు. రంపచోడవరం మండలం పెదగెద్దాడ నుంచి సోకులు గూడెం మధ్యలో మూడు కల్వర్టులు వర్షాలకు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ నర్రి పాపారావు పీవోను కోరారు. మద్దిరాతి గూడెం నుంచి నేరేడువలస వరకు రెండు గ్రామాలను కలుపుతూ ఐదు కిలోమీటర్లు రోడ్డు నిర్మించాలని చేయాలని కత్తుల పండురెడ్డి, సాధన రామిరెడ్డి విన్నవించారు. మారేడుమిల్లి మండలం చట్లవాడలో ఫైబర్‌నెట్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పల్లాల రమేష్‌రెడ్డి, బత్తుల ప్రతాప్‌సింగ్ కోరారు. వివిధ సమస్యలపై 43 అర్జీలు స్వీకరించినట్టు పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. ఏపీవో డీఎన్‌వీ రమణ, ఎస్‌డీసీ జాన్‌రాజ్, డీఎల్‌పీవో రఘునందన్ పాల్గొన్నారు.

కుమార్తె మృతిని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

పద్మనాభం: కుమార్తె మృతిని తట్టుకోలేక మద్యానికి బానిసైన తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పద్మనాభం ఎస్ఐ జె.సురేష్ అందించిన వివరాలు. బాందేవపురానికి చెందిన బోనెల సింహాద్రి కుమార్తె కోటలక్ష్మి నాలుగు నెలల క్రితం పాముకాటుకు గురై మృతి చెందింది. కుమార్తె మృతితో తీవ్ర మనోవేదనకు గురైన తండ్రి బోనెల సింహాద్రి(41) మద్యానికి బానిసై ఈ నెల 4న పురుగుల మందును తాగాడు. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 4 గంటలకు మృతి చెందాడు. దీనిపై ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మారిన రైళ్ల వేళలు



తాటిచెట్లపాలెం(విశాఖ) : విశాఖపట్నం చేరుకునే పలు రైళ్ల వేళలు ఆయా తేదీల నుంచి మారుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు. • ఈ నెల 15వ తేదీ నుంచి న్యూఢిల్లీ–విశాఖపట్నం(20806) ఏపీ ఎక్స్‌ప్రెస్ విశాఖకు తెల్లవారు 4.10 గంటలకు బదులుగా 4.20 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 22 నుంచి లోకమాన్యతిలక్ టెర్మినస్–విశాఖపట్నం (22848) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తెల్లవారు 5 గంటలకు బదులుగా 5.10 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి హైదరాబాద్–విశాఖపట్నం (12728) గోదావరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తెల్లవారు 5.45 గంటలకు బదులుగా 5.55 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి కోర్బా–విశాఖపట్నం(18517) ఎక్స్‌ప్రెస్ ఉదయం 6.25 గంటలకు బదులుగా 6.40 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి సికింద్రాబాద్–విశాఖపట్నం (12740) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 7.40 గంటలకు బదులుగా 7.50 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి మచిలీపట్నం–విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.10 గంటలకు బదులుగా 8.20 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 20 నుంచి నాందేడ్–విశాఖపట్నం (20812) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.10 గంటలకు బదులుగా 9.20 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి బ్రహ్మపూర్–విశాఖపట్నం (08531) పాసింజర్ స్పెషల్ ఉదయం 9.20 గంటలకు బదులుగా 9.30 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి కాకినాడ పోర్ట్–విశాఖపట్నం (17267) ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.30 గంటలకు బదులుగా 9.40 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 19 నుంచి భగత్ కి కోటి–విశాఖపట్నం (18574) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.50 గంటలకు బదులుగా 10 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి భవానిపట్న–విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్ ఉదయం 10 గంటలకు బదులుగా 10.10 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి గాంధీధాం–విశాఖపట్నం (20804) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.10 గంటలకు బదులుగా 10.20 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి దుర్గ్–విశాఖపట్నం (18529) ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.20 గంటలకు బదులుగా 10.30 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 20 నుంచి తిరుపతి–విశాఖపట్నం (22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.30 గంటలకు బదులుగా 10.40 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి లోకమాన్యతిలక్ టెర్మినస్–విశాఖపట్నం (18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.40 గంటలకు బదులుగా 10.50 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 20 నుంచి హజరత్ నిజాముద్దీన్–విశాఖపట్నం (12804)స్వర్ణజయంతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.15 గంటలకు బదులుగా 2.45 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి రాయ్‌పూర్–విశాఖపట్నం (08527) పాసింజర్ స్పెషల్ రాత్రి 6.40 గంటలకు బదులుగా 7 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రాత్రి 8.20 గంటలకు బదులుగా 8.45 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి గుణుపూర్–విశాఖపట్నం (08521) పాసింజర్ స్పెషల్ రాత్రి 8.45 గంటలకు బదులుగా 9 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 15 నుంచి సికింద్రాబాద్–విశాఖపట్నం (20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.31 గంటలకు బదులుగా 11.35 గంటలకు చేరుకుంటుంది. • ఈ నెల 18 నుంచి కొల్లాం–విశాఖపట్నం (18568) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.40 గంటలకు బదులుగా 11.45 గంటలకు చేరుకుంటుంది.